# గూడులేని ప్రతి కుటుంబానికీ 'గృహలక్ష్మి'




లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు అందజేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్,హాజరైన లబ్ధిదారులు, ప్రజలు, కార్యకర్తలు

- కాంగ్రెసోళ్లు కొత్త బిచ్చగాళ్లు
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ

తిమ్మాపూర్ రూరల్ , అక్టోబర్ 3: గూడు లేని ప్రతి కుటుంబానికీ 'గృహలక్ష్మి' పథకం కింద ఇండ్లు మంజూరు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి సాయిరాం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు మొదటివిడుత మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు, క్రీడా ప్రాంగణాలకు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కొత్త బిచ్చగాళ్లలా ఊరురా తిరుగుతున్నారని, పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల స్కీమ్ అనేది పెద్ద బూటకమని విమర్శించారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు చేసింది ఏమీలేదని, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి ఊరురా తిరుగుతున్నారని ఆరోపించారు . కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితబంధు, బీసీ కులాల రుణాలు, సంక్షేమ పథకాలు లేవన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్టంలో అమలు చేస్తున్నాని చెప్పారు. గృహలక్ష్మి పథకంలో ఇండ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేస్తామని, ఈ పథకం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరందిస్తూ ప్రతి ఆడబిడ్డ కాళ్లు కడుగుతున్నామని పేర్కొన్నారు. ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవుడు ఎక్కడో లేడని సీఎం కేసీఆర్ రూపంలో ప్రజల్లో ఉన్నారని చెప్పారు. చిన్న దేవుడు రసమయిని గెలిపిస్తే, పెద్ద దేవుడు కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని తెలిపారు. సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఇనుకొండ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ పథకాలు ఇలాగే అందాలంటే మరోసారి ఎమ్మెల్యే రసమయిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో పవన్‌కుమార్, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో కిరణ్, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు?

### కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మన్నెంపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బీనపెల్లి సంపత్ అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు. ఇక్కడ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, సర్పంచ్ మేడి అంజయ్య, ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, రైతు బంధుసమితి గ్రామాధ్యక్షుడు నాంపల్లి శంకరయ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### కొడుకులు లేని నాకు కేసీఆరే పెద్దకొడుకయ్యారు



40 ఏళ్లుగా సీపీఐలో కార్యకర్తగా పని చేస్తున్నా. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేసింది. కొడుకులు లేని నాకు కేసీఆర్ పెద్దకొడుకులా ఇల్లు మంజూరు చేశారు. పార్టీలకతీతంగా ఇల్లు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే రసమయి, ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీటీసీ పాశం తిలక్ ప్రియా అశోక్‌రెడ్డికి రుణపడి ఉంటా.

**-వెలిశాల వీరేశం, గృహలక్ష్మి లబ్ధిదారుడు (మొగిలిపాలెం)**

### ప్రభుత్వ సాయం మరువలేనిది..



నిరుపేదనైన నేను సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డాను. పార్టీలకతీతంగా గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు. కూలీనాలి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న నాకు గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు కావడంతో సొంత ఇంటి కల నెరవేరినట్లయింది. ప్రభుత్వ సాయం ఎప్పటికీ మరువలేనిది.

**-కొలిపాక తార, గృహిణి(మన్నెంపెల్లి)**

## ప్రజా మద్దతు బీఆర్ఎస్‌కే

సైదాపూర్, అక్టోబర్ 3: ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండలాధ్యక్షుడు ఎల్కపల్లి రవీందర్ మంగళవారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు అందించడంతో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని తెలిపారు.

## ఈద్గాకు ప్రభుత్వ స్థలం కేటాయించడంపై హర్షం

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 3: కరీంనగర్ పట్టణ ముస్లింల ఈద్గాకు కొత్తపల్లిలో 8 ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై కరీంనగర్ ఉమ్మడి జిల్లా మసీద్ అండ్ ఈద్గా కబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్‌హుస్సేన్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలో సర్వే నంబర్ 127లో 7 ఎకరాల 8 గంటలు, సర్వేనెంబర్ 128లో 32 గుంటలు మొత్తం 8 ఎకరాల ప్రభుత్వ భూమిని ముస్లింలకు కేటాయించడం సంతోషదాయకమన్నారు. కరీంనగర్ ముస్లింలకు ఈద్గా లేక చాలా మంది వివిధ మసీదులతో పాటు సాలెనగర్ ఈద్గాలో నమాజు చేస్తున్నారని తెలిపారు.

## చెట్టును ఢీకొట్టిన లారీ

శంకరపట్నం, అక్టోబర్ 3: కేశవపట్నం శివారులో ప్రధాన రహదారిపై ఓ లారీ చెట్టును ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఓ లారీ హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తోంది. కేశవపట్నం వరకు రాగానే తెల్లవారుజామున నిద్ర మత్తులో ఉన్న డ్రైవర్ చెట్టును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా, లారీ ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. డ్రైవర్‌ను దవాఖానకు తరలించారు.

# యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షుడుడిని సన్మానిస్తున్న సభ్యులు

- అఖిల భారత యాదవ మహాసభల జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ
- మండల కేంద్రంలోయాదవుల ఆత్మీయ సమ్మేళనం

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 3: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభల జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ముఖ్య అతిథిగా నాగారపు సత్యనారాయణ హాజరై మాట్లాడారు. యాదవులు రాజకీయంగా ఎదగాలని ఆకాక్షించారు. ఉన్నత విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితరర రంగాల్లో యాదవులు రాణించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యాదవుల కోసం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మైలారం శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు మర్రి వెంకటమల్లు, నాయకులు ఇట్టివేణి నాగరాజు, వేణు, నూకల తిరుపతి, లచ్చయ్య, బాలయ్య, నూకల చింటు పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాలను ఇంటింటా వివరించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్
- అన్నారంలో కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 3: ప్రభుత్వ పథకాలను ఇంటింటా వివరించాలని జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. అన్నారంలో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జడ్పీటీసీ, గ్రామాధ్యక్షుడు పడకంటి వీరేశం, సర్పంచ్ బోట్ల కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ బూత్ స్థాయి కార్యకర్తలందరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. కుల సంఘాలకు మౌలిక వసతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో డాక్టర్ రసమయి బాలకిషన్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ ఎంపీటీసీ రాజనర్సు, ఉప సర్పంచ్ ముగాల మహేందర్‌రెడ్డి, నాయకులు పార్నంది కిషన్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, మాధవరం వెంకటేశ్వర్‌రావు, రాయికంటి కిరణ్, పురం అనిల్ కుమార్, పప్పు మల్లేశం, అట్ల గట్టయ్య, కార్యకర్తలు ఉన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గందె రమేశ్



రమేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు

చిగురుమామిడి, అక్టోబర్ 3: బీసీ సంక్షేమ సంఘం యువత రాష్ట్ర కార్యదర్శిగా గాగిరెడ్డిపల్లెకు చెందిన చెందిన గందె రమేశ్ నియామకమయ్యారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం యువత జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ రమేశ్‌కు నియామకపత్రం అందజేశారు. రమేశ్ మాట్లాడుతూ బీసీ సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం యువత రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్, విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య ఉన్నారు.